క్లుప్తంగా

ముగిసిన పాండవుల తీర్థం



పాండవుల తీర్థంలో భక్తుల కోలాహలం

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెంలో ఐదు రోజులుగా వైభవంగా జరుగుతున్న పాండవుల తీర్థం ఆదివారంతో ముగిసింది. చివరిరోజు ఆదివారం, సెలవు దినం కావడంతో మండలం నుంచే కాకుండా చుట్టు పక్కల గ్రామాలు, వివిధ ప్రాంతాల నుంచి విశేష సంఖ్యలో భక్తులు కొండకు పోటెత్తారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దీంతో కొండ కిక్కిరిసింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై యువి శివనాగబాబు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు.

జిల్లా వీఆర్వోల సంఘ కార్యదర్శిగా చంటిబాబు



తుని రూరల్: కాకినాడ జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్వో) సంఘం కార్యదర్శిగా తుని మండలం ఎస్.అన్నవరం వీఆర్వో కొట్టేటి చంటిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాకినాడలో ఆదివారం సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. సంఘ సభ్యులు తనను జిల్లా కార్యదర్శిగా తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు చంటిబాబు తెలిపారు. జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన చంటిబాబుకు తుని, తొండంగి, కోటనందూరు మండలాల వీఆర్వోలు శుభాకాంక్షలు తెలిపారు.

అగ్నిప్రమాద బాధితులను ఆదుకుంటాం



జి.కొత్తపల్లిలో బాధిత కుటుంబాలకు దుస్తులు అందిస్తున్న ఎంపీపీ పర్వత రాజబాబు

శంఖవరం: మండలంలోని జి.కొత్తపల్లిలో అగ్ని ప్రమాద బాధితులను అన్నివిధాలా ఆదుకుంటామని ఎంపీపీ పర్వత రాజబాబు అన్నారు. జి.కొత్తపల్లిలో ఇటీవల విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ అయ్యి రెండు తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. బాధిత కుంటుంబాలను ఆదివారం ఎంపీపీ పర్వత రాజబాబు పరామర్శించి దుస్తులు, నిత్యావసరాలు అందించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధితులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పర్వత రాజబాబు, సర్పంచ్ ఈగల విజయదుర్గ, వైఎస్సార్ సీపీ నాయకులు కోన బాబ్జి, ఈగల గంగ, గెడ్డం పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

గడ్డి వామి దగ్ధం



శంఖవరంలో కాలిపోతున్న గడ్డి వామి

శంఖవరం: గ్రామంలో ఆదివారం గడ్డివామి దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే.. గ్రామ శివారులోని రైతు తంగెళ్ల సోమరాజు పొలంలో గత కొద్ది రోజులుగా గడ్డివామి ఉంది. ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు వ్యాపించి గడ్డివామి దగ్ధమైంది. స్థానికులు పరిశీలించి మంటలను ఆర్పేందుకు విఫలయత్నం చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టి ఉంటారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ ప్రమాదంలో రూ.25 వేల ఆస్తి నష్టం కలిగినట్టు బాధితులు తెలిపారు.

నందీశ్వరునికి క్షీరాభిషేకం

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు రామలింగేశ్వరస్వామి ఆలయంలోని నందీశ్వరస్వామికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. మాఘ పౌర్ణమి సందర్భంగా స్వామివారికి క్షీరాభిషేకం చేసినట్టు ఆలయ అర్చకులు తెలిపారు.

నిలువ నీడ కరవు

- ఆక్రమణల చెరలో కోటనందూరు బస్టాండ్ సెంటర్
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- దాతలు నిర్మించిన షెల్టర్లను సైతం ఆక్రమించిన వ్యాపారులు
- తరచూ ట్రాఫిక్ సమస్య



వ్యాపార సముదాయంగా మార్చిన దాతలు నిర్మించిన తాత్కాలిక బస్‌షెల్టర్



కోటనందూరు బస్టాండ్ సెంటర్‌లో నిలిచిపోయిన ట్రాఫిక్

కోటనందూరు: స్థానిక బస్టాండ్ సెంటర్లో నిలువ నీడ లేకపోవడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. తుని–నర్సీపట్నం పట్టణాల మధ్య ఈ బస్టాండ్ సెంటర్ మీదుగా ప్రతిరోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. బస్టాండ్ సెంటర్ కేంద్రంగా చుట్టపక్కల సుమారు 50 గ్రామాలకు ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ సెంటర్లో కనీసం నిలబడడానికి కూడా నీడ లేకపోవడంతో ప్రయాణికులు మండుటెండలో మగ్గిపోతున్నారు. దాతలు నిర్మించిన తాత్కాలిక బస్ షెల్టర్లను చిరు వ్యాపారులు ఆక్రమించేయడంతో ప్రయాణికులు బస్ షెల్టర్ల బయట నడిరోడ్డుపై నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. వచ్చే వేసవిలో ప్రయాణికుల పరిస్థితి మరింత భయానకంగా మారే ప్రమాదముంది. దీనికి తోడు ఈ సెంటర్లో వ్యాపారులు రోడ్డును భారీగా ఆక్రమించేయడంతో తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ట్రాఫిక్ సమస్యను నియంత్రించాల్సిన పోలీసులు పట్టించుకోకపోవడంతో వ్యాపారుల ఆదిపత్యం మితిమీరుతోంది.

ఇదీ పరిస్థితి

కోటనందూరు బస్టాండ్ సెంటర్లో గతంలో ఆర్టీసీ ఆధ్వర్యంలో నిర్మించిన బస్‌షెల్టర్ ఉండేది. ఎండకు, వానకు ప్రయాణికులకు రక్షణగా ఉండే ఈ బస్‌షెల్టర్‌ను మూడేళ్ల క్రితం రోడ్డు విస్తరణ పేరుతో అధికారులు తొలగించారు. 100 అడుగుల వెడల్పులో వ్యాపారులను ఖాళీ చేయించారు. ఈ సెంటర్లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా రోడ్డును అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. ప్రయాణికులకు సౌకర్యవంతమైన బస్‌షెల్టర్‌ను నిర్మిస్తామని భరోసా ఇచ్చారు. అధికారుల హడావిడితో బస్టాండ్ సెంటర్‌కు మోక్షం కలిగిందని ప్రయాణికులు, స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. ఆ ఆనందం మూన్నాళ్ల ముచ్చటగా మారింది. అధికారులు అనూహ్యంగా రోడ్డు విస్తరణ ప్రక్రియను నిలిపేశారు. దీంతో వ్యాపారులు యథావిధిగా రోడ్డును ఆక్రమించేశారు. బస్టాండ్ సెంటర్‌పై అధికారుల అజమాయిషీ లేకపోవడంతో కథ మళ్లీ మొదటికొచ్చింది. వ్యాపారులు ప్రయాణికుల ఇబ్బందులను ఏమాత్రం పట్టించుకోకుండా దర్జాగా వ్యాపారాలు చేసుకుంటూ జేబులు నింపుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

50 గ్రామాలకు రాకపోకలు

కోటనందూరు, రౌతులపూడి మండలాలతో పాటు అనకాపల్లి జిల్లా నాతవరం మండలం నుంచి సుమారుగా 50 గ్రామాల నుంచి వేలాదిమంది ప్రయాణికులు కోటనందూరు బస్టాండ్ కేంద్రంగా ప్రయాణాలు సాగిస్తుంటారు. బస్టాండ్ సెంటర్లో చోటు చేసుకున్న ఆక్రమణలతో తరచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

బస్ షెల్టర్ తొలగింపు

రోడ్డు విస్తరణలో భాగంగా బస్టాండ్ సెంటర్లో ఉన్న బస్ షెల్టర్‌ను తొలగించారు. దీంతో ప్రయాణికులకు నిలువ నీడ కరువైంది. ప్రయాణికుల ఇబ్బందులను గుర్తించిన దాతలు సెంటర్లో రోడ్డుకు ఇరువైపులా తాత్కాలిక బస్‌షెల్టర్లను ఏర్పాటు చేయించారు. అయితే ఆ బస్‌షెల్టర్లను వ్యాపారులు ఆక్రమించేశారు. దీంతో ప్రయాణికులు బస్‌షెల్టర్ల బయటే మండుటెండలో కాళ్లపై నిలబడాల్సిన దయనీయ స్థితి నెలకొంది.

ట్రాఫిక్‌ను నియంత్రించాలి



కోటనందూరు బస్టాండ్ సెంటర్లో ఆక్రమణలు పెరిగిపోయాయి. తరచూ ట్రాఫిక్ నిలిచిపోతోంది. గంటల తడబడి వాహనాలు నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఈ సెంటర్‌ను దాటాలంటే వాహనచోదకులు విసుపోయే దయనీయ స్థితి నెలకొంది. ఉదయం, సాయంత్రం, పర్వదినాల్లో ట్రాఫిక్ సమస్య మరింత ఆందోళన కలిగిస్తుంది. అధికారులు స్పందించి ట్రాఫిక్‌ను నియంత్రించాలి. ప్రయాణికులు బస్టాండ్‌లో కూర్చునే వసతి ఏర్పాటు చేయాలి.

– అయిల వీరబాబు, ప్రయాణికుడు, కోటనందూరు

ఘనంగా ధ్వజస్తంభం ప్రతిష్ఠ



ఆర్అండ్ఆర్ కాలనీలో ధ్వజ స్తంభానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే చంటిబాబు

గోకవరం: కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీలో నూతనంగా నిర్మించిన రామాలయం వద్ద ధ్వజ స్తంభం ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించారు. తొలుత పండితులు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే చంటిబాబుకు ఘన స్వాగతం పలికారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో జగ్గంపేట మార్కెట్ కమిటీ ఛైర్మన్ జనపరెడ్డి బాబు, సొసైటీ ఛైర్మన్ గాజింగం సత్తిబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాటి రాంబాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, సుంకర వీరబాబు, కర్రి సూరారెడ్డి, తంటికొండ దేవస్థానం ఛైర్మన్ బద్దిరెడ్డి రాంబాబు(రెడ్డి), టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో 200 మంది చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

శంఖవరం: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్శితులై ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. రౌతులపూడి మండలంలోని గిడజాం గ్రామానికి చెందిన సుమారు 200 మంది టీడీపీ కార్యకర్తలు బీరా రామ్మోహనరావు ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే పర్వత సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. ప్రతి కార్యకర్త కష్టపడి పని చేసిన వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో తంటపురెడ్డి వెంకట రమణ, సుంకర గంగారావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన విశ్వేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

తొండంగి: మండలంలోని ఒంటిమామిడి శివారు విశ్వేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. దేవదాయ ధర్మాదాయశాఖ సారధ్యంలో ఆలయ ధర్మకర్త, ప్రధానార్చకుడు శంకరణం గోవిందరావు ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు స్వామివారి కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి మహారుద్రాభిషేకం, లక్షపత్రిపూజ, కల్యాణోత్సవం, శ్రీపుష్ప యాగం, పండిత సదస్యం, త్రిశూల స్నానం వంటి వైదిక కార్యక్రమాలు నిర్వహించారు.

కౌలురైతుపై దౌర్జన్యం

గోకవరం: మండలంలోని వీరలంకపల్లి గ్రామ శివారున రామకృష్ణా గార్డెన్స్‌ను కౌలుకు చేస్తున్న ఆదర్శ రైతు కొరిపల్లి అప్పలస్వామిపై ఆదివారం పలువురు దౌర్జన్యానికి దిగారు. వివరాల్లోకి వెళితే.. అప్పలస్వామి గత కొన్నేళ్లుగా బొండాడ రామకృష్ణమూర్తి పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. ఆదివారం బొండాడ రంగనాథస్వామి కొంత మంది వ్యక్తులతో వచ్చి ఈ పొలం తమదని పొలాన్ని ఖాళీ చేసి వెళ్లాలని దౌర్జన్యం చేశారు. దీంతో అప్పలస్వామి గోకవరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

హెల్మెట్‌ధారణపై అవగాహన ర్యాలీ



తునిలో హెల్మెట్ ధరించిన వాహనదారుడికి గులాబీ ఇచ్చి అభినందిస్తున్న ఎస్సై గోపాలకృష్ణ



జగ్గంపేటలో బైక్ ర్యాలీ చేస్తున్న పోలీసులు

జగ్గంపేట: ద్విచక్ర వాహనదారులు డ్రైవింగ్ సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని స్థానిక ఎస్సై విద్యాసాగర్ సూచించారు. జగ్గంపేటలో ఆదివారం హెల్మెట్‌ధారణపై అవగాహన కల్పిస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీసు స్టేషన్ నుంచి పుర వీధులు, జాతీయరహదారి మీదగా ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఎస్సై విద్యాసాగర్ మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలకు రక్షణ ఉంటుందన్నారు. కార్లు, మోటారు సైకిళ్లపై ప్రయాణించేటపుడు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఏఎస్సై నూకరాజు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణతో ప్రాణాలకు రక్ష

తుని: హెల్మెట్‌ధారణ ప్రాణాలకు రక్షణగా నిలుస్తుందని పట్టణ ఎస్సై సీహెచ్ గోపాలకృష్ణ అన్నారు. స్థానిక గొల్లప్పారావు సెంటర్‌లో ఆదివారం ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించిన ద్విచక్రవాహనదారులకు గులాబీలు ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై గోపాలకృష్ణ మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందన్నారు. వాహనాలు నడిపేటప్పుడు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణను అందరూ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైజాగ్ వెళ్లి పింఛను అందజేత



విశాఖపట్నం ఆసుపత్రిలో నారాయణమూర్తికి పెన్షన్ అందిస్తున్న వలంటీర్ వెంకటరమణ



కాకినాడ జీజీహెచ్‌లో వృద్ధురాలి బంధువుకు పింఛన్ సొమ్ము అందజేస్తున్న విద్యామాధురి

కోటనందూరు: మండలంలోని పాతకొట్టాం పంచాయతీ కేఎస్ కొత్తూరు గ్రామ వలంటీర్ వైజాగ్ వెళ్లి లబ్ధిదారుడికి పెన్షన్ అందించి మానవత్వం చాటుకున్నాడు. కేఎస్ కొత్తూరుకు చెందిన చింతల నారాయణమూర్తి గుండె, ఊపిరితిత్తుల సమస్యతో వైజాగ్‌లోని కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇతను వైఎస్సార్ పెన్షన్ కానుక లబ్ధిదారుడు కావడంతో గ్రామ వలంటీర్ పైల వెంకటరమణ సొంత ఖర్చులతో ఆసుపత్రికి వెళ్లి లబ్ధిదారుడికి రూ. 2,750 పెన్షన్ అందజేశాడు. వలంటీర్ వెంకటరమణను లోవదేవస్థానం మాజీ ఛైర్మన్ బొంగు ఉమారావు, సర్పంచ్ పసగడుగుల వరహాలు, ఉపసర్పంచ్ బొంగు గోపాలకృష్ణ, ఎంపీటీసీ దొగ్గా రామకృష్ణ అభినందించారు.

ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేత

కిర్లంపూడి: మండలంలోని జగపతినగరం గ్రామానికి చెందిన వృద్ధురాలు శరకణం రామయమ్మ అనారోగ్యంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె పింఛను లబ్ధిదారు కావడంతో గ్రామ సచివాలయం–2 వెల్ఫేర్ అసిస్టెంట్ బి.విద్యామాధురి ఆదివారం కాకినాడ ఆసుపత్రికి వెళ్లి రామయమ్మకు పింఛను అందజేసింది. వెల్ఫేర్ అసిస్టెంట్ విద్యామాధురిని గ్రామ నాయకులు, అధికారులు అభినందించారు.

తీరం.. భక్తజన హోరం



దానవాయిపేట తీరంలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు



ధర్మవరం సాయిబాబా ఆలయంలో సామూహిక పూజలు చేస్తున్న భక్తులు

తొండంగి: మాఘపౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం పుణ్యస్నానాలు ఆచరించేందుకు భారీగా భక్తులు తరలిరావడంతో మండలంలోని సాగర తీరం జనసంద్రమైంది. తొండంగి మండలంలోని పలు గ్రామాల ప్రజలతో పాటు తుని, శంఖవరం, రౌతులపూడి, గొల్లప్రోలు, ఏలేశ్వరం తదితర మండలాల నుంచి భక్తులు తరలివచ్చి సముద్ర తీరాల్లో పుణ్యస్నానాలు ఆచరించారు. ఈ సందర్భంగా దానవాయిపేట, అద్దరిపేట, వాకదారిపేట, పెరుమాళ్లపురం, కొత్తచోడిపల్లిపేట, తాటియాకులపాలెం, యర్రయ్యపేట, కొత్తపేట, పంపాదిపేట సముద్ర తీరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఎటువంటి ప్రమాదాలకు తావివ్వకుండా తొండంగి ఎస్సై ఎస్.రవికుమార్ ఆధ్వర్యంలో 100 మంది పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. పుణ్యస్నానాలకు వచ్చిన భక్తులకు దాతల సహకారంతో మజ్జిగ, పులిహోర, పాలు పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో మాఘపౌర్ణమి పూజలు

ప్రత్తిపాడు రూరల్: మాఘపౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని రాచపల్లి అరుణాచలక్షేత్రంలో స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం లలితా సహస్ర పారాయణం, మణిదీపవర్ణన పారాయణ చేశారు. ధర్మవరం సాయిబాబా ఆలయంలో సామూహిక విష్ణుసహస్రనామార్చన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రైల్వే పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రైల్వే అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు

తుని: రైల్వే పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ఆ అసోసియేషన్ తుని బ్రాంచి ప్రెసిడెంట్ జి. రమేష్ బాబు కోరారు. స్థానిక రైల్వే కల్యాణ మండపంలో ఆదివారం రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. తొలుత 2022లో మృతి చెందిన పెన్షనర్లకు నివాళులర్పించారు. 80 సంవత్సరాలు నిండిన 10 మంది పెన్షనర్లను సన్మానించారు. అనంతరం అధ్యక్షుడు రమేష్‌బాబు మాట్లాడుతూ పెన్షనర్లకు రావాల్సిన 18 నెలల డీఏ బకాయిలు విడుదల చేయాలని, ఎఫ్ఎంఏ రూ. వెయ్యి నుంచి రూ.3 వేలకు పెంచాలని డిమాండు చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

రైల్వే అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం జరిగింది. సంఘ అధ్యక్షుడిగా రమేష్ బాబు, గౌరవాధ్యక్షుడిగా వెంకటరావు, కార్యదర్శులుగా హనుమంతురావు, లక్ష్మణరావు , కోశాధికారిగా ప్రకాశరావును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులను పలువురు అభినందించారు.

ఇక మురుగు సమస్యకు చెక్

- రూ.2 కోట్లతో రహదారులకు ఇరువైపులా డ్రైన్ల నిర్మాణం
- స్వచ్ఛందంగా ఆక్రమణల తొలగింపు
- జోరుగా రహదారుల విస్తరణ పనులు



ఏలేశ్వరంలో స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగిస్తున్న దుకాణదారులు

ఏలేశ్వరం: పట్టణంలో మురుగు సమస్య తీరనుంది. ప్రధాన రహదారులకు ఇరువైపులా డ్రైన్ల నిర్మాణానికి అధికారులు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా ఆక్రమణలు తొలగిస్తున్నారు. ప్రధాన రహదారులకు అనుకుని ఆక్రమణలు పెరిగిపోవడంతో ఎప్పటి నుంచో ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. దీనికి తోడు రహదారులకు డ్రైన్లు లేకపోవడంతో వర్షం వస్తే చెరువులను తలపిస్తున్నాయి. చిన్న చినుకు పడినా రహదారులు నీటమునిగిపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుకాణదారులు సైతం వాడకం నీరు రహదారులపైకి వదలడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను గమనించిన నగర పంచాయతీ పాలకవర్గం రహదారులకు ఇరువైపులా డ్రైన్లు నిర్మించేందుకు రూ.2 కోట్ల నిధులు కేటాయించింది. 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.2 కోట్లతో లింగంపర్తి రోడ్, యర్రవరం రోడ్, నర్సీపట్నం రోడ్, పాత అడ్డతీగల రోడ్‌లకు ఇరువైపులా డ్రైన్ల నిర్మాణం చేపట్టనున్నారు.

దుకాణాల తొలగింపు : డ్రైన్ల నిర్మాణానికి రహదారులను ఆనుకుని ఉన్న ఆక్రమణలు తొలగించాలని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అధ్యక్షతన దుకాణాదారులతో సమావేశం నిర్వహించారు. పట్టణాభివృద్ధి కోసమే ఆక్రమణలను తొలగిస్తున్నామని, దుకాణదారులు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. దీంతో దుకాణదారులు స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగింపు చేపట్టారు. రహదారులు విశాలంగా మారడంతో డ్రైన్ల నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఆక్రమణల తొలగింపులో భాగంగా బాలాజీ చౌక్ వద్ద దివంగత నేత వైఎస్సార్ విగ్రహాన్ని తొలగించారు. ఆక్రమణల అనంతరం విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు వైఎస్సార్ సీపీ నాయకులు నిర్ణయించారు.

తీరనున్న సమస్య: ఆక్రమణ తొలగింపుతో ఎప్పటి నుంచి వేధిస్తున్న ట్రాఫిక్ సమస్య తీరడంతో పాటు మురుగునీటి సమస్య తీరనుంది. ప్రస్తుతం నాలుగు కూడళ్ల బాలాజీ చౌక్ వద్ద రెండు వాహనాలు తప్పుకోవడం ఇబ్బందిగా ఉంది. దీంతో పాటు రోడ్లు ఇరుకుగా ఉండడంతో మహిళలు నడిచి వెళ్లాలంటే నరకప్రాయంగా మారింది. ప్రస్తుతం ఆక్రమణలు తొలగించి డ్రైన్ల నిర్మాణం పూర్తయితే సమస్య తీరుతుందని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలు సహకరించాలి



ఆక్రమణలు తొలగించి డ్రైన్ల నిర్మాణానికి ప్రజలు సహకరించాలి. అభివృద్ధి నిమిత్తం డ్రైన్ల నిర్మిస్తున్నాం. ప్రజల సహకారం ఉంటే పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తాం.

– అలమండ సత్యవతి, చైర్ పర్సన్ నగర పంచాయతీ, ఏలేశ్వరం

మురుగు సమస్యకు చెక్



రహదారులకు ఇరువైపులా డ్రైన్లు నిర్మిస్తే ప్రజల ఇబ్బందులు తొలగుతాయి. వర్షపు నీరు, మురుగునీరు పోయేందుకు డ్రైన్లు నిర్మిస్తున్నాం. అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలి.

– కేవీకొండలరావు, కమిషనర్ నగర పంచాయతీ ఏలేశ్వరం

వైభవంగా మహాచండీ, సుదర్శన హోమాలు



ఎస్.అన్నవరంలో వేంకటేశ్వరస్వామికి సుదర్శన హోమం నిర్వహిస్తున్న అర్చకులు



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహిస్తున్న పండితులు

తుని రూరల్: పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని లోవ దేవస్థానం, ఎస్.అన్నవరంలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఆదివారం మహాచండీ హోమం, సుదర్శన హోమాలు నిర్వహించారు. లోవ దేవస్థానంలో తలుపులమ్మ అమ్మవారికి వేద పండితులు రాణి సుబ్రహ్మణ్యశర్మ, పురుషోత్తమ శర్మ, శశాంక్ త్రిపాఠి ప్రత్యేక పూజలు చేసి శాస్త్రోక్తంగా మహాచండీహోమం, పూర్ణాహుతి నిర్వహించినట్టు ఆలయ ఈఓ పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. ఎస్.అన్నవరంలో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అర్చకులు సుదర్శన హోమం నిర్వహించారు. పాతసంచుల వర్తక సంఘం ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఆలయం చుట్టూ ఊరేగించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం

అన్నవరం: మాఘ పౌర్ణమి సందర్భంగా రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి ఆదివారం ప్రత్యంగిర హోమం నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11.30 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. 30 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.